
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 12 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 52.603 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 52.603 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 30, ఉత్తరకాలువకు 100, దక్షిణకాలువకు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.93,950
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,495
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,750
సవర (8 గ్రాములు)	రూ.70,000

గరిష్టం/కనిష్టం
37.8 /26.7

వాతావరణం

జిల్లాలో వాతావరణం శనివారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 60 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేడూ రిజిస్ట్రేషన్లకు అవకాశం

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు రెండో శనివారం సెలవు అయినప్పటికీ జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పని చేయనున్నాయి. ఈ మేరకు ఉద్యోగులు విధులకు హాజరుకావాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు జరగనున్నాయి. సెలవులు, పండగ రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలనుకునే వారికి ప్రత్యేకంగా ఆఫర్ కూడా ప్రకటించింది.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ. 280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 414 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకు రాగా 361 పొగాకు బేళ్లను కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 53 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి వి.మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.230 లభించగా, సగటు ధర రూ. 260.74 లభించిందన్నారు. వేలంలో 13 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

సర్పంచ్‌లకు చెక్‘పవర్’

- టీడీపీ కండువా కప్పుకోలేదని ఇద్దరిపై అవినీతి ఆరోపణలు
- సెప్టెంబర్‌లో రద్దు చేసిన అధికారులు
- కోర్టుకు వెళ్లడంతో పునరుద్ధరించాలని ఉత్తర్వుల జారీ

నెల్లూరు సిటీ: న్యాయం గెలిచింది. వైఎస్సార్‌సీపీ మద్దతు ఇద్దరు సర్పంచ్‌ల చెక్ పవర్‌ను పునరుద్ధరించాలంటూ ఇచ్చిన హైకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం చెక్‌పవర్ కల్పిస్తూ డీపీఓ శ్రీధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ కండువా కప్పుకోలేదని నెల్లూరు రూరల్ మండలంలోని కలివెలపాళెం సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, పెనుబర్తి సర్పంచ్ సృజనపై అవినీతి ఆరోపణలు చేస్తూ గతేడాది సెప్టెంబర్‌లో టీడీపీ నేతలు తమ అధికార బలాన్ని వినియోగించి చెక్ పవర్ రద్దు చేయించారు. ఈ క్రమంలో తమపై అవినీతి ఆరోపణలు అవాస్తవమని, చెక్‌పవర్‌ను పునరుద్ధరించాలంటూ హైకోర్టును సదరు సర్పంచ్‌లు సెప్టెంబర్‌లో ఆశ్రయించారు. దీంతో హైకోర్టు ఫిబ్రవరి 20వ తేదీన వీరి చెక్ పవర్ పునరుద్ధరించాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కోర్టు ఉత్తర్వులను మార్చిలో రిజిస్టర్ పోస్టు ద్వారా తెలియజేయగా, శుక్రవారం చెక్ పవర్ పునరుద్ధరిస్తున్నట్లు డీపీఓ శ్రీధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

అదుపు తప్పిన కారు దగ్ధం

- ప్రయాణికులు సురక్షితం



ఉలవపాడు: మితిమీరిన వేగంతో వెళ్తున్న కారు అదుపు తప్పి ట్రాలీని ఢీకొట్టి, ఆ తర్వాత ఫెన్సింగ్‌ను ఢీకొనడంతో మంటలు చెలరేగి కారు దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని 16వ నంబరు జాతీయ రహదారిపై దక్షిణ బైపాస్‌లోని నాగేంద్ర స్వామి గుడి సమీపంలో శుక్రవారం జరిగింది. విజయవాడకు చెందిన ముగ్గురు యువకులు నెల్లూరులో వివాహానికి హాజరై తిరిగి విజయవాడ వెళ్తున్నారు. ముందు వెళ్తున్న ట్రాలీని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎడమ వైపున కారు ఢీకొనడంతో అదుపుతప్పి ట్రాలీని, ఫెన్సింగ్‌ను ఢీకొట్టింది. కారులో ఉన్న ప్రయాణికులు బయటపడి, లగేజీ తీసుకున్న తర్వాత కారు ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమైంది. స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంకర్ తీసుకువచ్చి ఆ నీటి ద్వారా స్థానిక యువకులు మంటలు ఆర్పారు. ఎస్సై అంకమ్మ ఘటనా స్థలిని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని మైన్లను ఓపెన్ చేయాలి

సాక్షిప్రతినిధి, నెల్లూరు: సైదాపురం మండలంలో ఉన్న అన్ని మైనింగ్ ప్లాంట్లను రీ ఓపెనింగ్ చేయించి వేలాది మంది అణగారిన మాదిగ ప్రజలకు జీవనోపాధి కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గొల్లపల్లి శ్రీనివాస మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆ సంఘం నాయకులు ఉదయకృష్ణ మాదిగ, ఎంఎస్‌పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అంబేడ్కర్ మాదిగ, ఆ సంఘానికి చెందిన కార్యకర్తలతో కలిసి శుక్రవారం ప్రకాశం జిల్లా పామూరు మండలంలోని మాలకొండపురం మైనింగ్ గనులను పరిశీలించడానికి వచ్చిన మైన్స్ సెక్రటరీ వీఎల్ కాంతారావును కలిసి వినతిపత్రం అందజేశారు. గొల్లపల్లి శ్రీనివాస మాదిగ మైనింగ్ సెక్రటరీతో మాట్లాడుతూ సైదాపురం మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు బాగా వెనుకబడి ఉన్నారన్నారు. ఏడాది కాలంగా మైన్స్ మూసివేయడంతో పేదలు పనులు లేక అల్లాడుతున్నారన్నారు. అన్ని మైన్లను తక్షణమే ఓపెన్ చేయించి పేదలకు పనులు కల్పించాలని కోరారు.

గ్రామ స్వరాజ్య పాలనకు

కూటమి తూట్లు



- సేవలు శూన్యం.. పథకాలు మాయం
- రేషనలైజేషన్ పేరుతో సచివాలయాలు నిర్వీర్యం
- ఏ, బీ, సీ క్లస్టర్లతో సగానికి కుదించిన వైనం
- ఉద్యోగుల సంఖ్యను సైతం తగ్గించిన పరిస్థితి
- సర్వేల పేరుతో రోడ్డున పడిన ఉద్యోగులు



మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపంగా దేశంలోనే ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కృతం చేశారు. ఈ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. రేషనలైజేషన్ పేరుతో సచివాలయాలను నిర్వీర్యం చేసే కుట్రలకు తెరలేపింది. ఉన్న ఖాళీలను భర్తీ చేయకుండా ఏ, బీ, సీ క్లస్టర్లుగా విభజిస్తోంది. సిబ్బందిని తగ్గిస్తోంది.


కోవూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల అమల్లో పైరవీలు, పక్షపాతం, అవినీతికి తావులేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ వాటిని అందజేయడమే లక్ష్యంగా 2019లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఐదేళ్ల పాటు అప్పటి ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం అమలు చేసినా గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఆయా పథకాలకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను నిర్వహించింది. సంక్షేమ పథకాలను అమలు చేయకుండా చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థను పూర్తిగా నీరుగార్చి, నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తోంది.

వైఎస్ జగన్ మార్కు చెరిపేసే కుట్ర

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ, సేవలు దేశ స్థాయిలో వివిధ రాష్ట్రాల ప్రశంసలు అందుకున్నాయి. ఆయన సృష్టించిన ఈ ఉద్యోగ వ్యవస్థ ఇలాగే ఉంటే ప్రజల్లో చరితార్థుడిగా నిలిచిపోతారని భావిస్తున్న కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ రూపురేఖలను చెరిపేసే కుట్రలు చేస్తోంది. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు బీటెక్, ఎంటెక్, డిగ్రీలు, పీజీలు చేసిన వారే ఉన్నారు. ఏపీపీఎస్సీ ద్వారా పోటీ పరీక్షల్లో నెగ్గి ఉద్యోగాలు పొందిన వీరిని కూటమి పాలకులు హీనంగా చూస్తూ వీరికి అదనపు పనులు అప్పగిస్తున్నారు.

సర్వేలతో సరి..

సంక్షేమ పథకాలకు తిలోదకాలిచ్చిన కూటమి ప్రభుత్వం ఉపయోగం లేని అనేక సర్వేలు చేయిస్తోంది. దీంతో ఉద్యోగులు రోడ్డున పడుతున్నారు. పీ–4 సర్వే, వర్క్ ఫ్రం హోమ్, రేషన్‌కార్డుల ఈకేవైసీ, అప్‌డేట్ ఈకేవైసీ, చైల్డ్ వితవుట్ ఆధార్, అక్షర చైతన్యం వంటి సర్వేలు చేయిస్తోంది. నెల్లూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద కోవూరు నియోజకవర్గంలో 22,000 మందికి చదువు నేర్పేందుకు సర్వే చేయించి, వారితోనే సాయంత్రం బడులు నడిపి అక్షరాభ్యాసం చేయాలని నిర్దేశించింది. వీటితో పాటు ఫార్మర్ రిజిస్ట్రేషన్, వెటర్నరీ సర్వేలు, హెల్త్ డిపార్ట్‌మెంట్ సర్వే, రీసర్వే, బీఎల్ఓ విధులు, ఇలా ప్రతి సచివాలయం ఉద్యోగి వారి స్థాయికి మించి విధులు అప్పగించింది.



గత ప్రభుత్వ పాలనలో ప్రతి 2 వేల మంది జనాభాకు ఒక గ్రామ, వార్డు సచివాలయాన్ని ఏర్పాటు చేసి సేవలు అందించారు. ఈ విధంగా అప్పట్లో 769 సచివాలయాలు ఉండగా రేషనలైజేషన్ పేరుతో వీటిని ఏ, బీ, సీ క్లస్టర్లుగా విభజించి 403 సచివాలయాలకు కుదించారు. అప్పట్లో ఒక్కో సచివాలయంలో ప్రతి శాఖకు ఒక అసిస్టెంట్ చొప్పున 11 మంది ఉద్యోగులు ఉండే వారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉద్యోగులను తగ్గిస్తోంది. జనరల్ పర్పస్‌గా 2,500 మంది లోపు జనాభా ఉన్న క్లస్టర్ సచివాలయంలో ఆరుగురు, ఆపైన 3,500 మంది లోపు జనాభా ఉన్న క్లస్టర్‌లో ఏడుగురు, ఆపై జనాభా ఉన్న క్లస్టర్‌లో ఎనిమిది మంది లెక్కన సిబ్బందిని కుదిస్తోంది.



సచివాలయ సేవలు శూన్యం

గత ప్రభుత్వం సచివాలయాల్లో 534 పౌర సేవలను అందుబాటులో తెచ్చింది. కానీ ఇప్పుడు ఆయా సేవలు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ సిబ్బందిని సర్వేల పేరుతో వేధింపులు గురి చేస్తోంది. ఆదివారాలు, పండగలు, సెలవులతో సంబంధం లేకుండా నిరంతరం టార్గెట్లు విధించి పనిభారం పెంచి మానసికంగా, శారీరకంగా తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోంది. సిబ్బందిని ఫీల్డ్ సర్వేలు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో సిబ్బంది ఆఫీస్‌లో అందుబాటులో ఉండటం లేదు. ప్రభుత్వం అనేక సర్వేలు చేయిస్తున్నా.. ప్రజలకు ఒక్క పథకం, ప్రయోజనం అందడం లేదు.

రేషనలైజేషన్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి



రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలంటే మొదటగా ఆరేళ్ల సర్వీసు పూర్తయిన నేపథ్యం ఆయా శాఖల వారీగా సీనియారిటీ జాబితా విడుదల చేసి పారదర్శకంగా పదోన్నతులు కల్పించాలి. తద్వారా మిగులు సిబ్బంది సంఖ్య తగ్గుతుంది. ఏ సచివాలయాలు ఏ కేటగిరీ కిందకు వస్తుందో ఆయా సచివాలయాల్లో మంజూరు పోస్టులను మాత్రమే భర్తీ చేయాల్సి ఉంటుంది. ఏ, బీ, సీ కేటగిరీలో ఉన్న పోస్టులు, వివిధ శాఖల్లో ఖాళీలు చూపించి మెరిట్ లిస్ట్ ర్యాంక్ ఆధారంగా పారదర్శకంగా కౌన్సెలింగ్‌కు ఆప్షన్ ఎంచుకునేలా ఉద్యోగికి అవకాశం ఇవ్వాలి.

– జి రాజ్యలక్ష్మి, యునైటెడ్ వెల్ఫేర్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆదర్శనీయుడు జ్యోతిరావు పూలే



జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సామాజిక సంస్కర్త, బీసీల ఆరాధ్య దైవం, మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శనీయులని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కొనియాడారు. పూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా బీసీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి, మహిళా విద్యావ్యాప్తికి పూలే చేసిన కృషి ఎనలేనిదన్నారు. పూలే కృషి ఫలితంగానే నేడు సమాజంలో బీసీ వర్గాల ప్రజలు ప్రతి ఒక్కరూ.. స్వేచ్ఛ, సమానత్వంతో అన్ని హక్కులు పొందుతూ సమాజంలో ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. అదే స్ఫూర్తితో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు సంక్షేమ పథకాల్లోనూ, రాజ్యాధికారంలోనూ ప్రాధాన్యత ఇచ్చిన విషయం మనందరికీ తెలిసిందేనన్నారు. ఇదే వరవడితో భవిష్యత్‌లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజలకు మరింత మెరుగ్గా సేవలు అందిస్తామన్నారు.

నేడు ఇంటర్ ఫలితాల విడుదల

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఉదయం 11 గంటలకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల ఫలితాలను విడుదల చేయనున్నారు. గత నెల 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు ప్రథమ సంవత్సరానికి సంబంధించి 28,176 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 25,024 మంది కలిపి మొత్తం 53,200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ ఫలితాలను https://resultsbie. ap. gov. in వెబ్‌సైట్‌లో ఉంచనున్నారు. ఈ వెబ్‌సైట్‌తో పాటు మన మిత్ర వాట్సాప్ నంబరు 9552300009 నంబరుకు హాయ్ అని మెసేజ్ పంపించి వివరాలను నమోదు చేసి ఫలితాలను తెలుసుకునే అవకాశాన్ని కల్పించారు.

పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలి

- కలెక్టర్ ఓ.ఆనంద్

నెల్లూరు (పొగతోట): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్న పిల్లలు, బాలింతలకు గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. శుక్రవారం బీవీనగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్లను కలెక్టర్, రిటైర్డ్ ఐఏఎస్ సుబ్బారావు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అన్ని సౌకర్యాలు అందుతున్న తీరును పరిశీలించారు. ప్రీస్కూల్ పిల్లలతో ఏబీసీడీలు, రెయిమ్స్, అడిగి చెప్పించుకుని ముచ్చటించారు. అంగన్‌వాడీలు, ఆయాల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యాప్స్‌ను సక్రమంగా వినియోగించి గర్భిణులు, బాలింతలు, పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండా కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ అనూరాధ, అర్బన్ సీడీపీఓ కె.లక్ష్మిదేవి, జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అక్షరానికి సంకెళ్లా!



గాంధీబొమ్మ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు, వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు

- సాక్షి ఎడిటర్, విలేకరులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి
- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన
- గాంధీబొమ్మ వద్ద ఆందోళన చేసిన జర్నలిస్టులు

నెల్లూరు (పొగతోట): అధికార పార్టీ దమనకాండను, దాష్టీకాలను ఎత్తి చూపుతున్న అక్షరంపై అక్కసుతో అదే అక్షరానికి సంకెళ్లు వేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని, ప్రభుత్వ దమన నీతికి నిదర్శనమని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.వెంకటేశ్వర్లు, సీహెచ్ మస్తాన్‌రెడ్డి దుయ్యబట్టారు. పల్నాడులో టీడీపీ నేతలు సాగించిన హత్యాకాండను ప్రచురించినందుకు ‘సాక్షి’ దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి, ఆరుగురు విలేకరులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలంటూ డిమాండ్ చేస్తూ శుక్రవారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా జర్నలిస్టులపై వేధింపుల కేసులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వార్తలు ప్రచురించినంత మాత్రాన పోలీసులు కేసులు పెట్టడం తగదన్నారు. వార్తల్లో ఏమైనా ఇబ్బందికరమైన విషయాలు ఉంటే ఖండించాలన్నారు. లేదంటే న్యాయపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కానీ ప్రజాస్వామ్యంలో ముఖ్య భూమిక పోషిస్తున్న పత్రికలను, పత్రికా విలేకరులను అక్రమ కేసుల ద్వారా వేధించడం తగదన్నారు. తక్షణమే అక్రమ కేసులను రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గతంలో అనేక పర్యాయాలు విలేకరులపై దాడులు, అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. వీటిపై ఏపీయూడబ్ల్యూజే విలేకరులకు అండగా అనేక నిరసనలు, ఆందోళనలు చేపట్టిందన్నారు. అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే కోశాధికారి హనూక్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రమేష్ బాబు, సామ్నా అధ్యక్షుడు సుబ్బారావు, ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, కోశాధికారి సునీల్ గవాస్కర్, సహాయ కార్యదర్శులు ఏనోష్, జాషువ, వివిధ పత్రికా విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి అపార నష్టం

తాటిపర్తిపాళెంలో 1000 పుట్లకు పైగా తడిచిన ధాన్యం



తాటిపర్తిపాళెంలో తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టుతున్న దృశ్యం

వెంకటాచలం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి రైతులకు అపార నష్టం కలిగింది. తెల్లవారుజామున 2 గంటల నుంచి మండలంలోని తాటిపర్తిపాళెం, పూడిపర్తి, తిక్కవరప్పాడు, ఈదగాలి, గుడ్లూరువారిపాళెం, ఇస్కపాళెం, నిడిగుంటపాళెం, తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం పడడం మొదలైంది. గాఢ నిద్రలో ఉన్న రైతులు తాము పండించి ఆరబెట్టిన ధాన్యాన్ని తడవకుండా పట్టలు కప్పి కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. అకస్మాత్తుగా వర్షం కురవడంతో తాటిపర్తిపాళెంలోనే సుమారు 1000 పుట్లకు పైగా వరి ధాన్యం తడిపోయిందని రైతులు వాపోతున్నారు. పూడిపర్తి, ఎగువమిట్ట, గుడ్లూరువారిపాళెం, ఇస్కపాళెం గ్రామాల్లోనూ కొంత మేరకు ధాన్యం తడిచిందని రైతులు చెబుతున్నారు. కొందరు రైతులు ఆరబెట్టిన ధాన్యం తడవకుండా పట్టలు కప్పి ముందస్తు జాగ్రత్తలు పాటించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తడిచిపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. అధికారులు తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



ధాన్యంపై కప్పిన పట్టలు

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ భారీ ర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

కందుకూరు: కేంద్రం అమల్లోకి తెచ్చిన వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముస్లిం, మైనార్టీలు శుక్రవారం పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు జరిగిన ఈ ర్యాలీలో ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా వక్ఫ్ సవరణ చట్టాన్ని చేసిందన్నారు. ముస్లిం, మైనార్టీల హక్కులను కాలరాసే విధంగా ఈ చట్టాన్ని రూపొందించిందని వివరించారు. వక్ఫ్ బోర్డు పరిధిలోని ఆస్తులను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లిం, మైనార్టీల హక్కులను కాపాడాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమానికి సీపీఐ, సీపీఎం నాయకులతోపాటు, పలు ప్రజా సంఘాల నాయకులు తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

బెట్టింగ్.. కిల్లింగ్

ఐపీఎల్ నేపథ్యంలో జోరుగా పందేలు

- పక్కదారి పడుతున్న యువత
- బజారున పడుతున్న కుటుంబాలు
- కందుకూరులో ఓ యువకుడి ఆత్మహత్య

ఇటీవల ఐపీఎల్ బెట్టింగ్‌లో స్వరం కోల్పోయిన ప్రకాశం జిల్లాకు చెందిన ఓ యువకుడు కందుకూరు పట్టణంలో లాడ్జీలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.



కందుకూరు రూరల్: చిన్నపాటి పనులకు వెళ్లే ఓ యువకుడు ఉన్నట్టుండి కారు కొన్నాడు. ఊరికే తిరుగుతుండే ఒకతను ఇష్టానుసారంగా డబ్బు ఖర్చు చేస్తున్నాడు. ఒక్కసారిగా ఏం జరిగిందో తెలియదు. వాడు బాగా సంపాదించాడు. బాగా సెటిల్ అయ్యాడు. వీరంతా కష్టపడి ఉద్యోగం వల్లో.. రియల్ ఎస్టేట్ చేసి సంపాదించారనుకుంటే పప్పులో కాలేసినట్లే. దీనంతటికీ కారణం క్రికెట్ బెట్టింగ్. అది కూడా నేరుగా ఆడి సంపాదించారనుకుంటే పొరపాటే. బెట్టింగ్‌లు ఆడించి, మధ్యవర్తిత్వం చేసి కమీషన్ల రూపంలో డబ్బులు సంపాదించారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్న చందంగా వారిని చూసి మరికొందరు ఈ ఊబిలోకి దిగుతున్నారు. ఆడేవారికి ఎప్పుడు నష్టమే.. ఆడించే వారికి మాత్రం ఎప్పుడు లాభమే. ఈ కిటుకు తెలియని అమాయకులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో బెట్టింగ్‌లు ఆడి కుటుంబాలను, జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

జరుగుతోందిలా..

ప్రస్తుతం ఐపీఎల్ జరుగుతోంది. ఈ నేపథ్యంలో కందుకూరు ప్రాంతంలో క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. వ్యవహారమంతా ఫోన్లలోనే నడుస్తోంది. ఒక మధ్యవర్తి ఆడిస్తుంటాడు. ఆ వ్యక్తి ఒక బ్యాచ్‌ను ఏర్పాటు చేసుకుంటాడు. ఈరోజు ఫలానా జట్టుపై ఇంత బెట్టింగ్ ఉంది. వేసే ఆసక్తి ఉంటే డబ్బులు ఫోన్‌పే కొట్టమని చెప్తాడు. ఆడించే వ్యక్తికి గెలిచిన వారు 15 నుంచి 25 శాతం కమీషన్ ఇవ్వాలి. ఇలా కేవలం కమీషన్ రూపంలోనే రోజుకు ఒక వ్యక్తి రూ.5 లక్షల వరకు సంపాదిస్తున్నట్లు సమాచారం. కందుకూరు ప్రాంతంలో ముగ్గురు ఆఫ్‌లైన్‌లో, ఇద్దరు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. తమకు వచ్చిన కమీషన్లలో కొంతమొత్తాన్ని కొందరు పోలీసులకు వాటాగా పంపిస్తున్నట్లు సమాచారం. దీంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. డబ్బులు వచ్చినోళ్లు ఈరోజు ఆనందపడితే.. మరుసటి రోజు ఓడిపోయి నిరుత్సాహ పడుతున్నారు.

చిత్తవుతున్న యువత

ఐపీఎల్ మ్యాచ్‌లు మొదలయ్యాక యువత బెట్టింగ్ మోజులో జీవితాలను నాశనం చేసుకుంటోంది. డబ్బు పోగొట్టుకున్న వారు దొంగలుగా మారుతున్నారు. ఇంట్లో వస్తువులు అమ్ముకునే స్థాయికి దిగజారుతున్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులైతే తల్లిదండ్రులు కొనిచ్చిన లాప్‌ట్యాప్‌లు, మొబైల్ ఫోన్లు, చేతికి ఉండే ఉంగరాలు, ఇతర విలువైన సామగ్రిని అమ్ముకొని బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. డబ్బులు పోతే అంతటితో వదిలేద్దామనే ఆలోచన రావడం లేదు. తిరిగి అలాగే సంపాదించాలని అప్పులు చేస్తున్నారు.

అప్పులు చేసి..

గతంలో ఓ అధికారి పింఛన్ పంపిణీ చేయాలని ఇచ్చిన డబ్బులను క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టాడు. ఒకటో తేదీన పెన్షన్లు ఇవ్వలేదని ఉన్నతాధికారులు ప్రశ్నించడంతో ఉద్యోగం పోతుందని ఐదారు రోజుల తర్వాత అప్పు చేసి మరీ ఇచ్చాడు. మరో అధికారి బెట్టింగ్‌కు బానిసై తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. ఇంట్లో వాళ్లకు బాగోలేదని సాకు చెప్పాడు.

క్లుప్తంగా

ఆటో బోల్తా



ఘటనా స్థలంలో ఆటో

ఉలవపాడు: ప్రమాదవశాత్తు మామిడికాయల లోడు ఆటో బోల్తాపడిన ఘటన జాతీయ రహదారిపై కొల్లూరుపాడు ఫ్లై ఓవర్‌పై శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం వివరాల మేరకు.. ఒంగోలు నుంచి నెల్లూరుకు ట్రక్కు ఆటో మామిడికాయల లోడుతో వెళ్తోంది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండి ఆటో నడపటంతో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు గాయాలు కాలేదు. మామిడి కాయలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. రోడ్ సేఫ్టీ సిబ్బంది వచ్చి కాయలను మళ్లీ లోడ్ చేయించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



లారీ కింద వెంకటేశ్వర్లు మృతదేహం

కందుకూరు రూరల్: మోపెడ్‌ను వెనుక నుంచి డీసీఎం లారీ ఢీకొట్టడంతో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని ఓగూరు సమీపంలో 167–బీ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఓగూరు గ్రామానికి చెందిన జి.వెంకటేశ్వర్లు (70) సింగరాయకొండ వైపు జాతీయ రహదారి పక్కనే ఉన్న జామ తోటకు తన టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో కందుకూరు నుంచి సింగరాయకొండ వైపు కూలీలతో వెళ్తున్న డీసీఎం లారీ వేగంగా మోపెడ్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వర్లు లారీ టైరు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. డీసీఎం లారీలో ఉన్న కూలీలు ఒకరిపై ఒకరు పడటంతో స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న కందుకూరు రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్రనాయక్ తెలిపారు.

కేజీబీవీల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

నెల్లూరు(టౌన్): కేజీబీవీల్లో 11, 12 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును ఈనెల 21వ తేదీ వరకు పొడిగించినట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన బాలికలు మాత్రమే అర్హులని తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో నెల్లూరీయులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కమిటీల్లో జిల్లాకు చెందిన నాయకులు వివిధ హోదాల్లో నియమితులయ్యారు. శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. విద్యార్థి విభాగం సెక్రటరీగా రాచర్ల సతీష్‌బాబు, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ఉపాధ్యక్షుడిగా గోవుల వెంకయ్య, ప్రధాన కార్యదర్శిగా రాపూరు వెంకటసుబ్బారెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ సెక్రటరీగా లక్కు స్వరాజ్ నియమితులయ్యారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 111
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 222
లేయర్ చికెన్	: 170



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.85
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40



కొనుగోలు కేంద్రాన్ని తెరిచి ఆదుకోండి

- ప్రభుత్వానికి పసుపు రైతుల వినతి

ఉదయగిరి: ఉదయగిరి ప్రాంతంలో పసుపు సాగు విస్తీర్ణం అధికంగా ఉన్నందున కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఉదయగిరిలో 2014–19 టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పసుపు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. నాడు కొందరు టీడీపీ నేతలు పసుపు కొనుగోళ్లలో అక్రమాలు, అవినీతికి పాల్పడటంతో భారీ కుంభకోణం చోటుచేసుకుంది. అది పెద్ద సంచలనంగా మారింది. దీనివెనుక అప్పటి ఎమ్మెల్యే వెంకటరామారావు ముఖ్య అనుచరులు ఉండటం, వారిపైన కేసులు నమోదు చేయడం కూడా జరిగింది. దీంతో ఉదయగిరిలో పసుపు కొనుగోలు కేంద్రాన్ని నిలిపివేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పసుపు సాగు చేసిన రైతులు కడప, దుగ్గిరాల మార్కెట్లకు తీసుకెళ్లి వ్యయ ప్రయాసలకోర్చి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం జిల్లాలో పసుపు తవ్వకాలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంతో పంటను అమ్ముకునేందుకు సరైన మార్కెట్ వసతి లేక దళారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి రైతులకు ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి ఉదయగిరిలో పసుపు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఉదయగిరిలో పసుపు కొనుగోళ్లు (ఫైల్)

రైతులకు అండగా ఉంటాం

రాపూరు: నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు అండగా ఉంటామని నెల్లూరు ఆర్డీఓ అనూష తెలిపారు. రైతులతో ఆమె శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ధర తక్కువగా ఉందని ఈ ప్రాంత రైతులు తెలిపారని, దీనిపై వారికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 548 మంది భూములు కోల్పోతున్నారని చెప్పారు. పట్టా ఉన్న వారికి ఎకరాకు రూ.6 లక్షలు, అసైన్డ్ భూములకు రూ.3 లక్షల ధరగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాపూరు మండలంలో భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించి బ్యాంక్‌లో ప్రభుత్వం రూ.4 కోట్లు జమచేసిందన్నారు. అభ్యంతరం లేని వారికి బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేస్తామని తెలిపారు. అభ్యంతరం ఉంటే కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ అనూష

బీసీ భవన్ నిర్మాణం పూర్తి చేస్తాం

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు రూరల్: రూ.5.27 కోట్లతో నెల్లూరులో బీసీ భవన్ నిర్మాణం పూర్తి చేస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి మంత్రి, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లాలో 500 మంది బీసీ యువతకు స్వయం ఉపాధి పథకాల కింద మంజూరైన రూ.11.4 కోట్ల మెగా చెక్కును పంపిణీ చేశారు. అనంతరం ఆనం మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో బలహీనవర్గాలకు న్యాయం చేస్తామన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని పలువురు నేతలు కోరారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ చెంచల బాబు యాదవ్, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి వెంకటలక్ష్మమ్మ, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పించిన మంత్రి, కలెక్టర్, అధికారులు

యువకుడి మృతదేహం లభ్యం

ఉలవపాడు: సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతైన యువకుడు చనిపోయాడు. కరేడు పంచాయతీ పరిధిలోని కొత్తపల్లెపాళెం తీరంలో మృతదేహం లభ్యమైంది. స్థానికుల కథనం మేరకు.. కరేడు చైతన్య నగర్‌కు చెందిన శింగోతు హేమంత్ (18) స్నేహితులతో కలిసి గురువారం సముద్ర స్నానం చేస్తున్న సమయంలో అలల తాకిడి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఒడ్డుకు కొట్టుకొచ్చిన మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కుమారుడు మరణించడంతో తండ్రి గోపాల్ కన్నీరుమున్నీరుగా రోదించాడు.



హేమంత్ మృతదేహం

పెన్నా నదిలో..

సంగం: మండల కేంద్రమైన సంగంలో పెన్నానదిలో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సంగం పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నక్కలోళ్ల సెంటర్‌కు చెందిన నక్కల బుజ్జిబాబు (35) సంగంలో జరుగుతున్న సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాల నిమిత్తం భార్య మేరీతో కలిసి రెండు రోజుల క్రితం వచ్చాడు. బుజ్జిబాబు గురువారం రాత్రి మద్యం తాగాడు. శుక్రవారం తెల్లవారుజామున పెన్నా నదిలో బేరికట్ట వద్ద బహిర్భూమికి వెళ్లాడు. ఈ క్రమంలో నదిలో మునిగిపోయి మృతిచెందాడు. ఉదయం అటు వైపుగా వెళ్లిన కొందరు యువకులు నదిలో మృతదేహం ఉందని పోలీసులకు సమాచారమిచ్చారు. సంగం ఇన్‌చార్జి ఎస్సై సైదులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మేరీ, కుటుంబ సభ్యులు విగతజీవిగా పడి ఉన్న బుజ్జిబాబును చూసి కన్నీరుమున్నీరుగా రోదించారు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి హామీ నిధుల దుర్వినియోగం

తోటపల్లిగూడూరు: మండలంలోని తోటపల్లి, వెంకన్నపాళెం పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి రూ.1.16 లక్షలు దుర్వినియోగమయ్యాయి. ఈ నిధులను రికవరీ చేసేందుకు అధికారులు చొరవ తీసుకోవాలి' అని డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సోషల్ ఆడిట్ జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గడిచిన ఆర్థిక సంవత్సరంలో తోటపల్లిగూడూరు మండలంలో రూ.11 కోట్లతో 1,753 పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా పనిచేయడం లేదని, రికార్డుల నిర్వహణలో లోపాలు ఉన్నాయన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నలుగురిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పనులకు హాజరయ్యే ఒక్కో కూలీకి రూ.300ల వేతనం తగ్గకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో డీపీఓ విజయలక్ష్మి, ఏపీడీ గాయత్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న పీడీ

కండలేరులో 47.135 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 47.135 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,380, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

